జ్వాల దశ
నిజం.. నిర్భయంగా..
బుధవారం
11-03-2026
జిల్లా వార్తలు
WWW. DASHANEWS. COM

# పోలీసుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

## "ఆరోగ్య ఖాకీ" కార్యక్రమాన్ని ప్రారంభించిన సిద్దిపేట పోలీస్ కమిషనర్...






**దశ, సిద్దిపేట:** సిద్దిపేట పోలీస్ కమిషనరేట్ పరిధిలోని పోలీస్ అధికారుల మరియు సిబ్బంది సంక్షేమం కోసం "ఆరోగ్య ఖాకీ పోలీస్ వెల్నెస్ & ఫిట్నెస్ ఇనిషియేటివ్" అనే వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. మంగళవారం కమిషనరేట్ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమానికి సిద్దిపేట పోలీస్ కమిషనర్ ఎస్. రష్మీ పెరుమాళ్,ముఖ్య అతిథిగా హాజరై హెల్త్ ప్రొఫైలింగ్ ప్రక్రియను ప్రారంభించారు. సిద్దిపేట ప్రభుత్వ వైద్య కళాశాల వైద్యుల బృందం ఈ సందర్భంగా పోలీసులకు వివిధ ఆరోగ్య పరీక్షలు నిర్వహించింది.

ఈ కార్యక్రమంలో అదనపు డీసీపీ అడ్మిన్ కుశాల్కర్ , అదనపు డీసీపీ ఎఆర్ సుభాష్ చంద్రబోస్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి (డి ఎం & హెచ్ ఓ ) డాక్టర్ ధనరాజ్, ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎం. సురేష్ బాబు, ఆర్ఎంఓ జి. అనిల్, తెలంగాణ డయాగ్నోస్టిక్స్ హబ్ మేనేజర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ నిరంతర విధి నిర్వహణలో డాక్టర్లు పోలీసులు 24 గంటలు విధుల్లో ఉండే వృత్తులు.

సమాజంలో ఎక్కడ సమస్య తలెత్తినా పోలీసులు అక్కడికి వెళ్ళాల్సిందే. అందుకే పోలీసులు ఎల్లప్పుడూ మానసికంగా , శారీరకంగా ఫిట్ గా ఉండాలని సూచించారు. నిరంతర పని ఒత్తిడి వల్ల 20, 30 ఏళ్ల వయసులో ఉన్న సిబ్బంది కూడా ఆహారం, నిద్ర, ఆరోగ్య అలవాట్లపై సరైన శ్రద్ధ చూపడం లేదు. ఇది పని సామర్థ్యాన్ని తగ్గిస్తుందని, అసలు మన శరీరంలో ఏదైనా సమస్య ఉందా లేదా అనేది అప్పుడప్పుడు ఇలా స్క్రీనింగ్ పరీక్ష చేసుకుంటూ ఉండాలని సూచించారు. ఆరోగ్యం అంటే కేవలం శారీరక దృఢత్వం మాత్రమే కాదు, మానసిక ప్రశాంతత కూడా. కుటుంబ సమస్యలు, ఆర్థిక ఇబ్బందుల వల్ల పోలీసుల్లో ఆత్మహత్యల ప్రవృత్తి పెరుగుతోంది. శారీరక దృఢత్వం ఉంటేనే మానసిక బలం చేకూరుతుంది. సైకిల్ సజావుగా సాగాలంటే రెండు చక్రాలు ఎలా ముఖ్యమో, మనిషికి శారీరక మానసిక ఆరోగ్యం అంతే ముఖ్యం. ఈ ప్రారంభ దశలో మొదటి రోజు 200 మంది పోలీస్ సిబ్బందికి వివిధ పరీక్షలునిర్వహించారు. ఈ చొరవ ద్వారా ప్రతి పోలీస్ అధికారికి ఒక వ్యక్తిగత హెల్త్ ప్రొఫైలుపొందించబడుతుందిరిపోర్టుల ఆధారంగా ఎవరికైనా అనారోగ్య సూచనలు ఉంటే, వాళ్ల ని ముందుగానే అప్రమత్తం చేసి తగిన వైద్య సలహాలు ఆరోగ్యకరమైన అలవాట్లను అలవర్చుకునేలా ప్రోత్సహిస్తామని సిపి రష్మీ పెరుమాళ్,పేర్కొన్నారు.

---

## హైవేపై వేగంగా వచ్చిన కారు ఢీకొని ఇద్దరు గాయాలు




**దశ, నల్గొండ:** నల్గొండ-హైదరాబాద్ హైవేపై వేగంగా వచ్చిన కారు ఢీకొని ఇద్దరికి గాయాలు అయ్యాయి. నల్గొండ-హైదరాబాద్ హైవేపై ఉన్న అన్లిమిటెడ్ షాపింగ్ మాల్ సమీపంలో వేగంగా వచ్చిన కారు రోడ్డు ఊడుస్తున్న మున్సిపల్ శానిటేషన్ కార్మికులను ఢీకొట్టింది. ఈ ఘటన సీసీటీవీలో నమోదైంది.ఈ ప్రమాదంలో ఒక మహిళా శానిటేషన్ కార్మికురాలి రెండు కాళ్లు విరిగినట్లు సమాచారం. అదే సమయంలో స్కూటర్పై వెళ్తున్న యువకుడిని కూడా కారు ఢీకొట్టడంతో అతనికి తీవ్ర తల గాయాలు అయ్యాయి. గాయపడిన వారిని నల్గొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కారును నడిపిన డ్రైవర్ను పోలీసులు అదుపులోకి తీసుకుని దర్యాప్తు ప్రారంభించారు.

---

## మార్చి 15న చలో బడంగ్ పేట్



**దశ, కొల్లాపూర్ :** కొల్లాపూర్ నియోజకవర్గంలో ఈరోజు BAMCEF, DS4, బహుజన సమాజ్ పార్టీ (బీఎస్పీ) వ్యవస్థాపకుడు మాన్యవర్ కాన్షీరాం 92వ జయంతి సందర్భంగా వాల్ పోస్టర్లను బీఎస్పీ కొల్లాపూర్ అసెంబ్లీ అధ్యక్షుడు బొల్లి కురుమయ్య ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహం దగ్గర విడుదల చేశారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి అసెంబ్లీ ఇంచార్జ్ ముని స్వామి మాట్లాడుతూ, "ఈ నెల 15న హైదరాబాద్ బడంగ్ పేట్లో BSP పార్టీ, వ్యవస్థాపకులు మాన్యవర్ కాన్షీరాం 92వ జయంతి సభను రాష్ట్ర అధ్యక్షుడు ఇబ్రహీం శేఖర్ నేతృత్వంలో నిర్వహించనున్నాం. తెలంగాణ ఉద్యమం ద్వారా తెలంగాణ స్వరాష్ట్రం ఏర్పడింది. మాన్యవర్ కాన్షీరాం గారి చూపిన మార్గంలో తెలంగాణ రాష్ట్రంలో బహుజన ఉద్యమం కొనసాగితే బహుజనులకు రాజ్యాధికారం లభిస్తుందని ఆశిస్తున్నాం" అని తెలిపారు. ముని స్వామి, మాన్యవర్ కాన్షీరాం భారతదేశానికి గొప్ప నాయకుడు అని, ఉత్తర్ప్రదేశ్లో బాబాసాహెబ్ డా. అంబేద్కర్, మహాత్మా జ్యోతిబా పూలే మార్గంలో బీఎస్పీ పార్టీని స్థాపించి నాలుగుసార్లు అధికారంలోకి తీసుకువచ్చిన ఘనతలున్నారని కొనియాడారు. దేశంలోని ఆధిపత్య పార్టీలు డబ్బు, కుల ఆధారంగా అభ్యర్థులను పంపే పరిస్థితిలో, బహుజనుల శక్తిని పార్లమెంట్, అసెంబ్లీలకు తీసుకువచ్చిన ఘనత మాన్యవర్ కాన్షీరాం గారిదని చెప్పారు. ఈ మహనీయుడి 92వ జయంతి సభలో అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి అంజి, కొల్లాపూర్ మండల అధ్యక్షుడు బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

---

## పదవ తరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశం



**దశ, చిన్నంబావి:** చిన్నంబావి మండలం దగడపల్లి జడ్పీహెచ్ఎస్ గవర్నమెంట్ స్కూల్లో మంగళవారం 10వ తరగతి విద్యార్థులకు ఘనంగా వీడ్కోలు సమావేశం నిర్వహించారు. సభలో స్కూల్ హెడ్మాస్టర్ గోవిందు మాట్లాడుతూ, విద్యార్థులు పరీక్షల్లో మంచి మార్కులు సాధించి స్కూల్, గ్రామం, తల్లిదండ్రులకు గర్వకారణం కావాలని, ప్రతి ఒక్కరూ శ్రద్ధగా చదివి మంచి ఉద్యోగాలను సంపాదించాలని ప్రోత్సహించారు. "మీ తల్లిదండ్రులు మీపై నమ్మకం పెట్టి చదువుకు మద్దతుగా ఖర్చు చేస్తున్నారు. అందుకే మీరు చదువులో విజయం సాధించి మంచి పేరు ప్రతిష్టలు తీసుకురావాలి" అని ఆయన విద్యార్థులను ఉద్దేశించారు. వీడ్కోలు సభలో విద్యార్థులు ఉపాధ్యాయులకు, టీచర్స్కు, స్నేహితులకు తమ భావాలను వ్యక్తం చేసుకున్నారు. పది సంవత్సరాలుగా ఒకే స్కూల్లో చదివి వీడ్కోలు తీసుకోవడం వల్ల భావోద్వేగంతో కూడిన ఉపన్యాసాలను ఇచ్చారు. అలాగే, విద్యార్థులు ఆటలు, పాటలు, డాన్స్ ప్రోగ్రామ్లతో వేడుకను మరింత ఉత్సాహభరితంగా మార్చారు.

---

## 50 లక్షల ఓట్ల తొలగింపు..?

- ❖ *డూప్లికేట్ ఓట్లు ఇకపై కొనసాగవన్న ఈసీ అధికారులు.*
- ❖ *తెలంగాణా వ్యాప్తంగా 3.35 కోట్ల ఓట్లు.. ఈ సవరణ తర్వాత 2.80 కోట్లకు తగ్గిపోయే అవకాశం*



**దశ, హైదరాబాద్:** దేశవ్యాప్తంగా జరుగుతున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ తెలంగాణలో ఏప్రిల్, మే నెలల్లో జరగనుంది. ఈ ప్రక్రియ ద్వారా సుమారు 50 లక్షల ఓట్లదాకా బారీగా తొలగింపు జరగొచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. గడిచిన పదిహేనేళ్లలో రెండు మూడు చోట్ల ఓట్లు నమోదు చేసుకుని అన్నిచోట్లా కొనసాగుతున్న వారి డూప్లికేట్ ఓట్లు ఇకపై కొనసాగవని ఈసీ అధికారులు చెప్తున్నారు. తెలంగాణా వ్యాప్తంగా వున్న 3.35 కోట్ల ఓట్లు ఈ సవరణ తర్వాత 2.75 లేదా 2.80 కోట్లకు తగ్గిపోయే అవకాశముంది. పట్టణీకరణ, ఉపాధి అవకాశాల వల్ల ఇటీవల చాలామంది హైదరాబాద్ కు వలస వచ్చి స్థిరపడుతున్నారు. ఐనప్పటికీ వారి స్వంత గ్రామాల్లో కూడా ఓట్లు కొనసాగిస్తూ సందర్భాన్నిబట్టి రెండు చోట్లా ఓటు వినియోగించుకుంటున్నారు. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్ నుంచి హైదరాబాద్ వచ్చిన వారు ఇక్కడ ఓటు నమోదు చేసుకున్నారు. రెండు రాష్ట్రాల్లోనూ అసెంబ్లీ ఎన్నికలు వేర్వేరుగా జరుగుతుండటం వల్ల రెండు చోట్లా ఓటు వినియోగించుకుంటున్నారు. తాజా సవరణ జరిగితే ఆ డూప్లికేషన్కి అవకాశం ఉండదు. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లో కలిపి మొత్తంగా 87 లక్షల ఓట్లు ఉన్నాయి. అందులో ఈ రకమైన డూప్లికేట్ ఓట్లు సుమారు 20లక్షలదాకా ఉండొచ్చని అంచనా వేస్తున్నారు. వీరిలో ఆంధ్రప్రదేశ్ జిల్లాలనుంచి వచ్చినవారితోపాటు తెలంగాణ గ్రామీణ ప్రాంతాలనుంచి వచ్చి రాజధాని నగరంలో స్థిరపడి ఓటు నమోదుచేసుకున్నవారూ ఉన్నారు. బూత్ లెవల్ ఆఫీసర్ల ఆధ్వర్యంలో ఎన్యూమరేటర్ల ద్వారా మొదట ప్రతీ ఇల్లూ సర్వేచేసి ప్రాథమిక జాబితారూపొందిస్తారు. ఆ సమయంలో ఓటరు స్వయంగా అందుబాటులో ఉండి అక్కడే తన ఓటు కొనసాగించాల్సిందగా చెప్పవచ్చు. లేదా మీ తరఫున ఆ ఇంటి యజమాని తగిన డాక్యుమెంటు ఆధారాలిచ్చి ఫారంలో సంతకం చేసినా సరిపోతుంది. ఒకే వ్యక్తికి రెండు లేదా అంతకంటే ఎక్కువ ఓట్లున్నట్టు గుర్తించేందుకు ఈసీ ఓ ప్రత్యేక సాఫ్ట్ వేర్ వినియోగించబోతోంది. డెమోగ్రఫీ సిమిలర్ ఎంట్రీస్ ను పరిశీలిస్తారు.

---

## నాలుగు లేబర్ కోడులను రద్దు చేయాలని చేపట్టే ధర్నాలను జయప్రదం చేయండి




- ❖ *చలో హైదరాబాద్ ఐ ఎఫ్ టి యు పోస్టర్ ఆవిష్కరణ.*

**దశ సూర్యాపేట ప్రతినిధి :** మోడీ ప్రభుత్వం 29 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడులుగా కుదించి కార్మిక హక్కులను హరించడాన్ని వ్యతిరేకిస్తూ ఐఎఫ్ టి యు జాతీయ కమిటీ పిలుపు మేరకు ఈనెల 16న సూర్యాపేట జిల్లా కలెక్టర్ కార్యాలయం, 23న హైదరాబాదులో సెంట్రల్ లేబర్ కమిషనరేట్ కార్యాలయం ముందు జరిగే ధర్నాలో కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఐఎఫ్ టి యు జిల్లా ప్రధాన కార్యదర్శి గంటా నాగయ్య అన్నారు. ఐఎఫ్ టి యు ఆధ్వర్యంలో జరిగే ధర్నాలను విజయవంతం చేయాలని కోరుతూ సూర్యాపేట జిల్లా కేంద్రంలో గోడపత్రికను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా గంటా నాగయ్య పాల్గొని మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం 2026 ఏప్రిల్ 1 నుండి లేబర్ కోడులను అమల్లోకి తీసుకురానున్నారని వీటికి వ్యతిరేకంగా కార్మికుల పెద్ద ఎత్తున పోరాటాలు నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం కూడా ఈ లేబర్ కోడ్ లను తెలంగాణలో అమలు చేయలేమంటూ అసెంబ్లీలో ఒక తీర్మానాన్ని ఆమోదించి కేంద్ర కార్మిక మంత్రిత్వ శాఖకు పంపాలని విజ్ఞప్తి చేస్తున్నదన్నారు. ఈ లేబర్ కోడుల లో కార్మికుల వేతనాలు, పని పరిస్థితుల, జీవన ప్రమాణాలు మెరుగుదల కు సంబంధించిన అంశాలు ఏమైనా ఉన్నాయా అని భూతద్దం పెట్టి వెతికిన కనపడవని ఆయన అన్నారు. కార్మిక హక్కులను కాలరాస్తూ యాజమాన్యాల కు అనుకూలంగా ఈ కోడులలో మార్పులు చేశారని అన్నారు. కనీసం కార్మికులు యూనియన్లు పెట్టుకొని యాజమాన్యాలతో బేర సారాలు చేసుకునే హక్కును, సమ్మె చేసే హక్కును, వేతనాలు పెంచాలని కోరే హక్కును కూడా నిరాకరించారని ఇది రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని అన్నారు. ఫిక్స్ టర్మ్ ఎంప్లాయిమెంట్ పేరుతో కార్మికుల తో వెట్టిచాకిరి చేయించుకుంటూ వారి శ్రమను దోపిడీ చేయనున్నారని, ఎనిమిది గంటలకు బదులు పది నుంచి 12 గంటలు గంటలు అమలు చేయనున్నారని కార్మిక వర్గానికి తీవ్ర నష్టం చేస్తుందని విమర్శించారు. లేబర్ కోడు లను తక్షణమే రద్దు చేయకపోతే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని కేంద్ర ప్రభుత్వం ను హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో ఐఎఫ్ టి యు జిల్లా ఉపాధ్యక్షులు కునుకుంట్ల సైదులు, జిల్లా సహాయ కార్యదర్శి దేశోజు మధు, హమాలి యూనియన్ నాయకులు పురుషోత్తం, వెంకన్న, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు*

---

# భారీగా సోలార్ ఉత్పత్తికి సింగరేణి ప్రణాళికలు

- ❖ *గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తిలో భాగంగా సింగరేణి సంస్థ కీలక నిర్ణయం.*
- ❖ *రూ. 65 కోట్ల వ్యయంతో 15 వేల కిలోవాట్ల విద్యుత్ ఉత్పత్తిని లక్ష్యంగా.*



**దశ, అదిలాబాద్:** పర్యావరణహిత గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తిలో భాగంగా సింగరేణి సంస్థ కీలక నిర్ణయం తీసుకుంది. కార్మికుల నివాస గృహాలపై రూఫ్ టాప్ సౌర ఫలకాలను ఏర్పాటు చేయాలని డిసైడ్ అయింది. ఈ మేరకు సంస్థ ఏర్పాట్లు చేస్తోంది. సుమారు రూ. 65 కోట్ల వ్యయంతో 15 వేల కిలోవాట్ల విద్యుత్ ఉత్పత్తిని లక్ష్యంగా పెట్టుకుంది. దీనివల్ల సంస్థపై ప్రతి నెలా పడుతున్న రూ. 5060 కోట్ల విద్యుత్ బిల్లుల భారం కొంత మేర తగ్గనుంది.సింగరేణి సంస్థ గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తిలో భాగంగా కీలక నిర్ణయం తీసుకుంది. తాజాగా సింగరేణి ఏరియాల్లోని కార్మికుల నివాస గృహాలపై సోలార్ ప్యానళ్లు ఏర్పాటు చేసి విద్యుత్తు ఉత్పత్తి చేసేందుకు సిద్ధమవుతున్నారు. ఇందుకోసం అనువైన నివాస గృహాలను గుర్తించేందుకు ఆరు నెలల క్రితమే సింగరేణి అధికారులు సర్వే నిర్వహించారు. ఎక్కడైతే చెట్లు, నీళ్ల ట్యాంకులు లేకుండా ఖాళీగా నివాస గృహాలు ఉన్నాయో.. వాటిపై ఈ ప్యానళ్లు ఏర్పాటు చేసి సోలార్ విద్యుత్తు ఉత్పత్తి చేసేందుకు సిద్ధమవుతున్నారు. ఇందులో భాగంగా సింగరేణి యాజమాన్యం గతేడాది డిసెంబర్లో ఓ సంస్థతో అగ్రిమెంట్ సైతం కుదుర్చుకుంది. పదేళ్లపాటు ఈ సంస్థనే కార్మికుల ఇళ్లపై సోలార్ నిర్వహణ బాధ్యత చేపట్టనుంది.సింగరేణి క్వార్టర్లలో కార్మికుల గృహ విద్యుత్తు వినియోగానికి ప్రస్తుతం నెలకు సుమారుగా రూ.50 నుంచి 60 కోట్ల మేర చెల్లిస్తోంది.

రూఫ్ టాప్ సౌర విద్యుత్తుతో సింగరేణికి ఆ భారం చాలా వరకు తగ్గనుంది. అన్ని ఏరియాల వ్యాప్తంగా 15 వేల కిలోవాట్ల మేర సౌర విద్యుత్తును ఉత్పత్తి చేయాలని సంస్థ టార్గెట్గా పెట్టుకుంది. ఇందు కోసం రూ.65 కోట్ల ఖర్చు చేయనుంది. ఉద్యోగుల గృహాలకు వినియోగించగా మిగిలిన మొత్తాన్ని గ్రిడ్కి అనుసంధానించనున్నారు. ఈ మేరకు 800 మెగావాట్ల సౌర విద్యుత్తు ఉత్పత్తే లక్ష్యంగా ఇప్పటికే పలు ప్లాంట్లను ఏర్పాటు చేశారు. ఈ ప్లాంట్ల ద్వారా ప్రస్తుతానికి 500 మెగావాట్ల వరకు లక్ష్యాన్ని సాధించింది. రూఫ్టాప్ సౌర విద్యుత్తు పనులు త్వరలో ప్రారంభం అవుతాయని మణుగూరు వర్క్షాపు డీజీఎం శ్రీకాంత్ తెలిపారు. సౌర ఫలకలు ఏర్పాటు చేసేందుకు అన్ని విధాలుగా సిద్ధంగా ఉన్నామని అన్నారు.కాగా, సింగరేణి సంస్థ చేపట్టిన ఈ రూఫ్ టాప్ సౌర విద్యుత్ ప్రాజెక్టు వల్ల బహుళ ప్రయోజనాలు ఉన్నాయని పర్యావరణ నిపుణులు చెబుతున్నారు.

ప్రధానంగా.. ప్రతి నెలా కార్మికుల గృహ విద్యుత్ వినియోగం కోసం సంస్థ వెచ్చిస్తున్న రూ. 50 నుంచి 60 కోట్ల భారం గణనీయంగా తగ్గుతుందని చెబుతున్నారు. 15 వేల కిలోవాట్ల విద్యుత్ ఉత్పత్తి లక్ష్యంతో చేపట్టిన ఈ ప్రాజెక్టు ద్వారా సంస్థకు దీర్ఘకాలికంగా ఆర్థిక పొదుపు చేకూరుతుందని అంటున్నారు. పర్యావరణ పరంగా చూస్తే.. బొగ్గు ఆధారిత విద్యుత్తుపై ఆధారపడటం తగ్గి, కార్బన్ ఉద్గారాలు తగ్గుతాయని..ఇది గ్రీన్ ఎనర్జీ లక్ష్యానికి దోహదపడుతుందని వెల్లడిస్తున్నారు. గృహ అవసరాలకు పోగా మిగిలిన విద్యుత్తును గ్రిడ్కు అనుసంధానించడం ద్వారా అదనపు శక్తి వనరుగా మారుతుందని చెబుతున్నారు. ఇది సంస్థ ఆర్థికాభివృద్ధికే కాకుండా.. సింగరేణిని పర్యావరణ హితమైన తీర్చిదిద్దడంలో కీలక పాత్ర పోషిస్తుందని అంటున్నారు.

Printed, Published and Owned by B.KALPANA and Printed at Kalpana Publications , Flat No.101,Sri Heights Apartment,Shilpi Colony,Pasumamula Road,Pedda Amberpet,Rangareddy,Telangana-501505, and Published at Flat No.101,Sri Heights Apartment,Shilpi Colony,Pasumamula Road,Pedda Amberpet,Rangareddy,Telangana-501505. Editor: B.KALPANA. PRGI.No.TGTEL/25/A4195. Cell 9848288850, namasteshekar@gmail.com